# విధివిలాసం

= రచన: శ్రీ కె. విజయ్ బాబు =

గ్రామం రోడ్డువైపు చూస్తూ, ఏదో దీర్ఘంగా ఆలోచిస్తున్నాడు. ఆ చుట్టూ వున్న వాతావరణం-ఏ జన్మాన్నైనా సున్నం ఎరుగక పడిపోతున్న గోడలు, చిల్లులు పడి జారిపోతున్న పంచలు, నీరు లేక ఎండకు ఎడింసగం మాడి చస్తూన్న చెట్లు, రెండు వైపులా వున్న గోతుల్లోని మురుగు నీళ్ళు, ఆ నీళ్ళపై చక్కగా నాట్యం చేస్తూ పాడుతున్న దోమల గుంపులు, ప్రహరీపడి పోయినందున అడ్డులేక అక్కడి గడ్డిని సుఖంగా అనుభవిస్తున్న ఆవులు-గేదెలు వగైరాలు, చెట్ల కొమ్మలను నిర్భయంగా విరిచి మేకలను మేపుకొంటున్న గొల్లల కోలాహలము, సూర్య చంద్రాదులకు నివాసమనిపించే ఆ భవనపు యింటి కప్పులో అక్కడక్కడ పెద్ద కన్నాలు, ప్రక్క యిళ్ళవారికి డబ్బు ఖర్చు లేకుండా వుపయోగపడే వాసములు, దూలములు వగైరాలు, పాములు, తేళ్ళు మొదలయిన విష కీటకాలు స్థావరాలుగా ఏర్పాటు చేసుకున్న రాళ్ళ కప్పులు-ఆ యింటివారి దారిద్ర్యాన్ని తెలియజేస్తున్నాయి.

మాసిన గెడ్డము, నెరసిన వెంట్రుకలు, అక్కడక్కడా చేతికుట్లు గల లుంగీ బాడీలతో మసీదులో వున్న మహమ్మదీయునిలా అరుగుమీద కూర్చొని వున్నాడు ఆ యింటి యజమాని రామం.

నూనె అంటే ఎరుగని జుత్తుతోను, పూర్తిగా చిరిగి పోయినా గతిలేక ధరించిన పరికిణీలతోను, జాకెట్లతోను-అదే స్థితిలో వున్న లాల్చీ చెడ్డీలతోను కొందరు పిల్లలు పడిపోయిన గోడ యిటుకలతో ఆడుకొంటున్నారు,

అప్పటికి టైము సుమారు పది గంటలు కావస్తోంది. ఇంతలో ఒక మణుగు బరువుగల పుస్తకాల సంచితో రామంముందు ప్రత్యక్షమయాడు పంచాయతీబోర్డు బిల్లు కలెక్టరు రామనాథంగారు,

"ఏమండోయ్, రామంగారూ! మీ దుస్థితిని చూసి మీ యింటి పన్ను వసూలు చేయనందున మా ఆఫీసరు నాకు నానా చివాట్లుపెట్టి చివరికి నా జీతం కూడా ఆపు చేయించాడు. ఇంకా టాక్సు వసూలు కాకపోతే వారంటు యిచ్చి యిల్లు వేలం వేసైనా సరే పన్ను వసూలు చెయ్యమన్నారు."

"ఏమండీ రామనాథంగారూ! నాలాంటి నూరుగురు బీదవాళ్ళను బాధపెట్టి టాక్సు వసూలు చేసేకన్న ఒక లక్షాధికారివద్ద ఎందుకు వసూలు చెయ్యరు?"

"మీరు చెప్పింది నిజమే రామంగారూ! కాని మేమేం చెయ్యగలం. వాళ్ళదగ్గర మా ఆఫీసరుకి మొహమాటము అదీగాక భయంకూడాను. కారణ మేమిటంటే వారు ఆయన రహస్యాలు కొన్ని బయట పెడతారేమోనని. వారు వచ్చి చూడరు. మాలాంటి వారికి మీలాంటి వారిని చూస్తే విచారమే. కాని ఏం చెయ్యగలము? మేము మీలాంటివారి పరిస్థితిని ఎంత చెప్పినా వినక కసిరేస్తారు. ఇంకా మేము మొరపెట్టుతూంటే మీ జీతాలకు, రోడ్డు పనులకు డబ్బు ఎలా వస్తుందనుకున్నారు. ఏలాగోలా ఎవరిదగ్గరైనా వసూలు చెయ్యకపోతే పన్లు ఎలా జరుగుతాయి? అంటారు. అందుచేత మీ రేలాగోలా కష్టపడి టాక్సు కట్టకతప్పదు."

"పోనీ నా టాక్సు తగ్గించమని వ్రాసుకుంటే?"

"మీ పిచ్చిగాని, రామంగారూ! మీ మొర వినేవాళ్ళెవరు చెప్పండి? ఏ యం. యల్. ఏ నో, ఏ ధనవంతుణ్ణో పట్టుకుంటేనే తప్ప మీ కాగితాలుబుట్ట దాఖలే"

"పై అధికార్లకు అర్జీ పెట్టుకుంటే"

"పట్టి దండగ రెకమండేషన్ వున్న మాలాంటి వాళ్ళకే దిక్కులేక పోయింది. నా తమ్ముణ్ణి సంవత్సరమైంది సస్పెండుచేసి. ఎన్ని అప్లికేషన్సు పెట్టుకున్నా దిక్కూ మొక్కూ లేకుండా వుంటే మీలాంటి వాళ్ళ మాట ఒక లెక్కా!"

"పోనీ ఏ పంచాయతీ మెంబరువారి వల్లనైనా ప్రయత్నిస్తే?"

"మీరు యింకా వాళ్ళంతా స్నేహితు లనుకొంటున్నారు. ఒకానొకప్పుడు మీరు చూపిన ఔదార్యం, చేసిన దానధర్మాలు వట్టినే పోవని మీ ఉద్దేశ్యం కాబోలు. అదంతా వట్టి పొరపాటు."

"స్నేహితులు ఒక్కరూ సహాయం చెయ్యరంటారా?

"ఇంకెక్కడి స్నేహితులండీ! మీ డబ్బుతోటే స్నేహితులు కూడా పోయేరు. ఇప్పుడీ పరిస్థితుల్లో వారు మీకు సహాయం చేయడం పోయింది సరికదా, మిమ్మల్ని

కాతర్ లెస్‌గా చూస్తున్నారు. పేరుకోసం డబ్బు తగలేసారని నానా మాటలు అనుకొంటున్నారు. అప్పట్లో డబ్బుకోసమని మీ వెంట తిరిగేవాళ్ళలో ఒక్కరైనా యిప్పుడీ పరిస్థితుల్లో మీకు సహాయం చేస్తున్నారా? ఒకటి చెప్తాను వినండి రామంగారూ! "ధనం మూలం ఇదమ్ జగత్" డబ్బులేనివాణ్ణి ఎవరు చూస్తారు చెప్పండి ఆఖరికి డబ్బు లేనివాణ్ని దేముడైనా కన్నెత్తి చూడడు. అందుచేత పాత స్నేహితు లెవరూ సహాయం చేస్తారని నమ్ముకోకండి. మరి సెలవ్! రేపు మళ్ళీ వస్తాను. ఎలాగయినా ప్రయత్నించి రేపటి లోపుగా టాక్సు కట్టెయ్యాలి" అని హెచ్చరించి బిల్లు కలెక్టరు రామనాథం గారు వెళ్ళిపోయారు.

ఇంతలో ఒక అంబాసిడర్ కారు వచ్చి రామం యింటికి కొంచం దూరంలో ఆగింది. అక్కడ ఆడుకొంటున్న పిల్లలంతా కారుచుట్టూ చేరారు 'కారు ఎంత బాగుందిరా!' అని కొందరు, 'పాల కారేమో!' అని ఇంకొందరు, టీకాల కారేమో పొడిచేస్తారు, పారిపోదాం రండిరా!' అని మరికొందరు, 'ఓహో! ఎంత జిగజిగలాడుతోందిరా' అని ఒకరంటే 'ఏరోప్లయిన్ కారురా యిది' అని యింకొకరు 'నల్ల రంగుకన్న ఎర్ర రంగు వుంటే మరీ బాగుండేదిరా' అని మరొకరు, 'జెండా వుంది కాబట్టి యిది ఎలక్షను కారేమోరా' అని యింకొకరు-యిలా వారిలో వారు ఆ కారునుగురించి విమర్శించుకొంటున్నారు పిల్లలు.

కారు చప్పుడు విని పక్కిళ్ళ అమ్మలక్కలు బయటకు వచ్చి కారును, కారులోని మనుష్యుల్ని చూసి ఆశ్చర్య పడుతూ 'ఎవరింటికి వచ్చింది ఎవరిదా కారు?' అని ఒకావిడంటే, కారున్న చుట్టాలు వీళ్ళ కెవరున్నారు చెప్మా! అని మరొకావిడ బుగ్గలు నొక్కుకుంది. 'వీళ్ళే తిండిలేక పస్తులు పడుతూంటే వీళ్ళింటికి చుట్టరికాని కొచ్చేవాళ్లెవరు?' ఒక ముత్తయిదువ అనుమానం వెలుబుచ్చింది. 'ఆయన స్నేహితులు కాబోలు' అని మరొక ముత్తయి

Phone 2433 / 2933 Tel : "SOCIETY" Estd : 1938

NEW ERA IN THE NATIONAL INDUSTRY

Patronise Handloom Fabrics. Provide Work for Millions.

*ALWAYS INSIST UPON*

**THE SALEM AMMAPET SOCIETY'S PRODUCTS**

- Latest Design Sarees
- Choli Pieces
- Dhoties, Bhavanchu, Gundanchu
- Laced Dhoties & Angavastrams
- Bedsheets - Kerchieves Etc.,

*Please Visit Our Depot At*

Thiagarayanagar Sales Depot:-
No. 9, USMAN ROAD, T'NAGAR,
MADRAS-17.

Our Products can be had from our Sales Depots,
All Co-optex Units, Handloom Houses and our Agents.

A. MARIAPPAN,
*President.*

**THE AMMAPET HANDLOOM WEAVERS' CO-OPERATIVE PRODUCTION & SALE SOCIETY LTD., S. 532**

**AMMAPET, SALEM-3**

(TAMILNADU)

దువ సమాధాన మిచ్చింది. 'ఈ స్థితిలో ఆయన కెవరున్నారు స్నేహితులు!' ఖండించింది ఒక మామ్మగారు. ఇలాగా వారిలో వారు వాగ్వివాదాలు పడి చివరికి ఆ కారు బాగు చేసుకోడానికి ఆగిందని నిశ్చయించుకున్నారు.

కారులోంచి బయటకు వస్తున్న యువతీ యువకుల్ని చూసి పెళ్ళికాని అమ్మాయిలు 'ఒహో, ఆ అమ్మాయిది ఏమి దర్జా! ఆ వాయిలు చీరా, జార్జెట్ జాకెట్టు ఒకదాని కొకటి సూటియ్యా' యని ఒక అమ్మాయి, 'ఒక చేతికి బంగారు వాచీ, రెండవ చేతికి బంగారు గాజులు, మెడలో రవ్వల నెక్లిస్ వున్నాయి కాబట్టి ధనవంతుల బిడ్డేమో' నని ఒక నారీమణి, 'కాలికి జోడు, కంటికి జోడు చేతిలో వేనిటీ బేగు వున్నాయి. ఒకవేళ మహిళా సంఘ సభ్యురాలేమో' నని ఒక వనిత, 'మొహానికి పౌడరు, పెదాలకి లిప్‌స్టిక్, వాలుజడా, గాలికి ముఖంమీద నాట్యం చేస్తున్న ముంగురులు, సన్నటి నడుము, తెల్లటి శరీర రంగుని చూసి డ్రామా యాక్టర్ కాదుకాదా?' అని ఒక యువ్వనాంగి, 'ఓహో ఏమి అందం, ఏమి చందం, ఆహా! ఆ నడకలో ఏమి నాజూకు' అని మురిసిపోతోంది మరొక మాలిని. ఈ విధంగా ఆ అమ్మాయి అందాన్ని వర్ణిస్తూ వారిలో వారు ఆనందిస్తూంటే మరి కొందరు ముదితలు 'ఆ అమ్మాయి బాగానే వుంది కాని ఆవిడ ప్రక్కనున్న ఆ నల్లని వుంగరాల జుత్తు, కోల ముఖం, ఫ్రెంచి కట్ మీసాలు, ఆ వైట్ సూటు, నల్లని బూటుగల ఆ యువకుడు ఆ యువతికి ఏమవుతాడా?' అని సతమత మవుతున్నారు. చివరకు వారిద్దరూ భార్యాభర్తలేనని నిర్ధారణ చేసుకున్నారు 'ఈడూ-జోడూ' అని ఒకావిడంటే 'చిలకా గోరింకలు' అని మరొకావిడ వంత పలికింది.

కారులోంచి దిగిన శేఖర్, అతని భార్య శశి కారు చుట్టూ మూగివున్న కుర్రవాళ్ళను పిలిచి "రామంగారి యిల్లు ఎక్కడ?" అని అడిగారు. పిల్లలు రామం యిల్లు గుర్తు చెప్పేరు.

శేఖర్, శశి నడిచి తిన్నగా రామం యింటికి వచ్చారు. ఇంటి అరుగుమీద కూర్చొనివున్న రామాన్ని గుర్తుపట్టలేక శేఖర్ "ఏమండీ! రామంగారి యిల్లు యిదేనాండీ?" అని అడిగారు, శేఖర్ గొంతును, అతని మెడ మీదున్న పుట్టుమచ్చను గుర్తుపట్టిన రామం "ఓహో, శేఖర్! నేనేరా, రామాన్ని" అని పలకరించి ప్రక్కనున్న ఈతచాప పరిచి కూర్చోమన్నాడు. "అబ్బ! నువ్వేనట్రా రామం! ఎవరో అనుకున్నాను. గుర్తు పట్టలేకుండా మారిపోయావు సుమా!" అంటూ శేఖర్ చాప మీద ఆసీనుడయ్యాడు. నిలబడివున్న శశిని చూసి శేఖర్‌తో "నీ భార్యా?" అని అడిగాడు రామం. "అవున్రా! పేరు శశికళ" అని చెప్పగానే భార్యను కేకేసాడు రామం.

రామం భార్య శాంత వచ్చి శశిని లోపలికి తీసుకెళ్ళింది. వారిద్దరూ వంటింట్లో ఒక చాపమీద కూర్చున్నారు. ఆహారం సమంగా లేనందున చిక్కిన శరీరంతోను, లోతుకు పోయిన కళ్ళతోను, నల్లపూసలు తప్ప మరే ఆభరణం లేని మెడతో, సుందర శరీరమైనప్పటికి సంసార దురవస్థలవల్ల కృశించిన అవయవాలతోను, చేతికి రబ్బరు గాజులు, చవక రంగు చీర జాకెట్టుతో వున్న శాంతను చూసి శశి అసహ్యించుకొంటూ తప్పదు కదా! అని ఆవిడ ప్రక్కన కూర్చుంది.

Tel : "FRACTIONAL" Phone : 4909

- SIMPLE CONSTRUCTION.
- RELIABLE OPERATION.
- SILENT RUNNING

S K M - Single Phase Motors.
S K P - Self Priming Centripetal Pumps.
S K M/S K P Unit Electric Pumping Sets.

EACH UNIT IS THOROUGHLY TESTED BEFORE DESPATCH.

*FOR DETAILS*
*PLEASE CONTACT MANUFACTURERS :—*

SREE KRISHNA FOUNDRY
PAPANAICKENPALAYAM
COIMBATORE - 1

ఆ గృహలక్ష్మికి తోడు ఆ గది గోడలకున్న బొక్కి పటాలు, దండెంమీదున్న ఆ మాసిన గుడ్డలు, చిందరవందరగావున్న గ్లాసులు, గిన్నెలు, పళ్లెలు వగైరాలు, ఒకమూల వంటచెరకు, వేరొకప్రక్క నులకమంచము, మరొకప్రక్క దేవుడి పెట్టె, యింకోదగ్గర తిరగలి, రోలు, జల్లెడ, చీపురు వగైరాలతోవున్న ఆ గదిని చూస్తూంటే శశికి కంపరమెత్తుతోంది. 'ఇలాంటి వాతావరణంలోవున్న ఈ యింటి యజమానిని చూడటానికి ఎందుకు వచ్చాడు శేఖర్? తనతోపాటు నన్నుకూడా ఎందుకు వెంటబెట్టుకువచ్చాడు?' అని విసుక్కుంటోంది శశికళ. అక్కడినుంచి లేచిపోదామంటే భర్త ఏమనుకుంటాడోనని తప్పనిసరి అవడంవల్ల ముళ్ళమీద కూర్చున్నట్లు బాధపడుతూ అక్కడ కూర్చుంది.

తనని చూసి ఆశ్చర్యపోతున్న రామాన్ని ఉద్దేశించి 'ఏరా, రామం!, నువ్వు నా హేటూ, బూటు, సూటు చూసి ఎవరినో పైవాళ్ళను చూసినట్టు చూడటం. 'ఏమండీ' అనడం, నీ ఈ డ్రెస్సూ వాటం చూస్తూంటే యిదంతా కలేమోననిపిస్తోంది. నేను ఒక పెద్ద ఆఫీసర్నైనా, నాలుగురాళ్ళు సంపాదించినా మన చిన్ననాటి స్నేహం మరిచాననుకున్నావా? మీ యింట్లోనే నేనుకూడా చదువుకోవడం, మీ అమ్మగారి ఆదరణ, పరీక్షల్లో మన చూసి కాపీలు, స్కూలు వార్షికోత్సవానికి నాటకాలు వెయ్యడం, అందులో ముఖ్యంగా ఆనాటి 'గయోపాఖ్యానం' నాటకంలో నువ్వు కృష్ణుడుగాను నేను అర్జునుడిగాను యాక్టు చెయ్యడం, అందులో ఒక సీనులో అర్జునుడు మూర్ఛపడినట్లు యాక్టు చెయ్యడంలో నా బుర్ర సీను రోలరుమీదపడి చితకడం, నువ్వు నాటకంలో ఏడుపుకు బదులుగా నిజంగా నన్ను చూస్తూ ఏడవటం మరచిపోదామన్నా మరవలేకుండా వున్నాను. మనం నాటకాలకని చదువు మానేసి రాత్రిళ్ళు తిరుగుతూంటే మీ నాన్నగారు మనల్ని దెబ్బలాడి దగ్గరుంచి చదివించకపోతే మనం ఎలాగుండేవాళ్లమో గదా? అవన్నీ తలచుకొంటూంటే నవ్వొస్తూంటుంది.'

'అవున్రా! శేఖర్! నాకూ అలాగే అనిపిస్తూంటుంది.'

'భలేబాగుందిరా నీ వాటం! ఏమిటీ సైలెన్సు!? చిన్నప్పుడు నువ్వు కొట్టే ఫిలాసఫీ లెక్చర్ల ఫలితమా ఏమిటి నీ ప్రస్తుత పరిస్థితి? చిన్నప్పటి ఆ సరదా, చలాకీ, దర్జా, ఆ తెలివితేటలు, కామిక్ సంభాషణలు, స్కూల్ డిబేట్సులో చూపే పట్టుదలా, పెద్ద లాయర్లలాంటి ఆర్గ్యుమెంట్లు, ఫుడ్ బాల్ ఆటల్లో చూపించే ఆ చలాకీతనము ఈనాడు ఏమైపోయాయా? అని ఆశ్చర్యం కల్గుతోంది. ఆనాడు 'బికారి రాముడు' నాటకంలో నువ్వేసిన కేరక్టర్లాగ తయారయేవిప్పుడు.'

'బాబూ, ఆపరా! నీ లెక్చర్ బాగుందిగాని-ఇన్నాళ్లు నువ్వేమైనావు? నేనెప్పుడైనా జ్ఞాపకం వచ్చేవాడినా నీకు? నీసంగతంతా చెప్పరా!'

'జ్ఞాపకం రాకేరా! మళ్ళీ నిన్నెప్పుడు కల్సుకుంటానా? అని తహతహలాడేవాడిని. నా స్టోరీ చెప్తా విను. నీతోనే స్కూల్ ఫైనల్ పాసవగానే కాలేజీలో

Leading Printers of Quality....

*Contact for your Requirements of :—*

**Readymade Photo Offset Calendars, in Verious, Cine-Religious, Scenery, and Baby Designs.**

**CHIDAMBARAM LITHO PRESS**

[Tel: "VEESEE" — Post Box No. 43. — Phone No: 49.]

**SIVAKASI (S. I.)**

చదవడానికి డబ్బులేక మా నాన్న మావూరు వచ్చేయమనడం, నేను వెళ్లిపోవడం మరచిపోలేదనుకుంటా!'

'ఔను. అవన్నీ జ్ఞాపకమున్నాయి.'

'అయితే తర్వాత జరిగింది చెప్తా విను. మా నాన్న హెచ్చు చదువు చదివించలేనంటే మా మామయ్య నన్ను మద్రాసు తీసుకుపోయి కాలేజీలో చేర్పించారు. అక్కడే యం. ఎ. పాసయ్యాను. మద్రాసులో చదువుతూండటంవల్ల మనం కల్సుకోడానికి వీలులేకపోయింది. తర్వాత కొన్నాళ్ళకు మన స్నేహితుడు సూరిగాడు మద్రాసులో కనుపించితే నీగురించి అడిగాను. నువ్వు బి. ఎ. పాసయ్యావనీ రైల్వేలో పెద్ద వుద్యోగం చేస్తున్నావనీ చెప్పేడు. విని చాల సంతోషించాను. అవసరమైతే నీ సహాయంతో రైల్వేలో ఏదైనా జాబ్ సంపాదించాలనుకున్నాను. సూరిగాడిని నీ అడ్రసు అడగటం మరచిపోయాను. అందువల్ల నీ అడ్రస్ తెలిసిందికాదు నాకు.

తర్వాత మా మామయ్య నాకీ మంచి ఉద్యోగం యిప్పించాడు. క్రమంగా యిప్పటికి జిల్లా ఆఫీసర్ నయ్యాను. ఆయుర్దాయముంటే ఎప్పటికైనా కలుసుకోలేకపోతామా? అనుకుంటూండేవాడిని. మళ్ళీ ఒకసారి మన సూరిగాడు విజయవాడ రైల్వే ప్లాటుఫారంమీద తారసపడ్డాడు. నీగురించి అడిగితే నువ్వు రైల్వే ఉద్యోగం మానేసి వైజాగ్‌లో బట్టల వ్యాపారం చేస్తున్నావనీ, పబ్లిక్‌లో చాల పేరు సంపాదించావనీ గొప్ప స్టేటస్‌లో వున్నావనీ చెప్పేడు. తెలిసి పరమానందాన్ని పొందేను. నీ అడ్రస్ కూడా వాడే యిచ్చాడు. నిన్ను కల్సుకుందామని ప్రయత్నించేవాడిని. ఆఫీసు పనుల వత్తిడివల్ల నిన్ను యిప్పటివరకూ కలుసుకోలేకపోయాను. నాకు ఈ జిల్లాకే ట్రాన్స్‌ఫర్ అయింది. ఆఫీసుకి వెళ్ళి చార్జి తీసుకున్నాను. నా లగేజ్ యింకా తీసుకురాలేదు. నువ్వు యిక్కడ వున్నావుకదా! అన్న ధైర్యంతో నేనూ శశీ బయలుదేరి వచ్చేశాం. నీ దర్శనమైంది. చాల సంతోషంగా వుందిరా యిప్పుడు' అని ముగించాడు శేఖర్.

'నీ స్టోరీ చాల బాగుందిరా! నువ్వు జ్ఞాపకం చేసినట్లు మన చిన్ననాటి వేదాంత లెక్చర్లలోని సారాంశం బాగా గ్రహించాను. అయితే అప్పటి 'భికారిరాముడు' పోర్షను యిప్పుడు వేస్తే బాగా ఒప్పిస్తానుకదూ? బాల్యస్నేహితుల ప్రేమ తత్వం యిప్పుడు బోధపడిందిరా! ఆనాడు కుచేలుడు శ్రీకృష్ణుడిదగ్గరకెళితే ఈనాడు కృష్ణుడే కుచేలుడి దగ్గరకు వచ్చేడు. నువ్వింకా పూర్వకాలపు మనిషిలాగున్నావురా శేఖర్! ఈకాలంలో డబ్బులేనివాడిని ఎవరు చూస్తారు చెప్పు? భార్యాపిల్లలకే బరువైపోతారావ్యక్తి. పాత స్నేహితులు పొలిమేరలోనైనా కనుపించరు. డబ్బుతోటే గౌరవము, బంధువులు, డబ్బుతోటే తెలివితేటలు, డబ్బుతోటే సుఖము వుందిరా! అసలు డబ్బుతోటే వుంది యీ ప్రపంచం. కాని, నాకీస్థితే బాగుందిరా శేఖర్!'

'అందుకేరా నీ చిన్ననాటి ఫిలాసఫీ నీకిప్పుడు పనికి వచ్చిందంటున్నాను. అపకారికి ఉపకారం చేయవలసిందిగా మాష్టారు చిన్నప్పుడు చెప్పేరుకదూ!? అలాంటిది ఉపకారం పొంది మరచిపోయి ప్రత్యుపకారం చెయ్యనివాడు ఒక 'బీస్టు' అని నా ఉద్దేశం. 'ధనం శాశ్వతంకాదు. మనుష్యులు శాశ్వతంకాదు. వారి వారి దాన ధర్మాలే ప్రతివారికి శాశ్వతమని మీ నాన్నగారు చెప్పేవారు జ్ఞాపకముందా? ఆపదలో ఆదుకునేవాడే మిత్రుడు. అంతేకాని బాహ్యాడంబరాలు చూపేవాడు ఒక మిత్రుడేనా?'

''ఆఁ! దానికేంగాని, అయితే ఎప్పుడు మేరేజ్ చేసుకున్నావు? ఏమిటి సంగతి, చెప్పరా నాయనా!''

''నా భార్య శశి బి. ఎ. పాసయింది. మా ఆఫీసులో మానేజర్‌గా పని చేస్తూండేది. అంతకుముందు మేమిద్దరం కాలేజీలో సహాధ్యాయులం. ఆమెకా వుద్యోగాన్ని యిప్పించింది నేనే. తర్వాత యిద్దరం పరస్పరం ప్రేమించుకుని రిజిస్టర్ మేరేజ్ చేసుకున్నాం'' అని చెప్పి తన భార్య శశిని పిలిచి రామానికి పరిచయం చేసాడు.

రామం శశి ముఖాన్ని చూసి ''ఈవిడ ముఖం నాకు కొంచం పరిచయమున్న ముఖంలాగే కనుపిస్తోందిరా శేఖర్! నీ భార్య నా భార్య సిస్టర్స్‌లా గున్నారుకదూ?''

''ఔన్రా! వీరిద్దరి ముఖాలు చూస్తూంటే అలాగే అనిపిస్తోంది.'' రామం, భార్య శాంతవైపు చూసి ''శాంతా! శశి నీ చెల్లెలు సుసీల లాగుంది కదూ?'' అని అడిగాడు.

''ఔను, అది జీవించివుంటే యింతే వయస్సుండేది''

"మనిషిని పోలిన మనుష్యు లుంటారనడానికి ఋజువు దొరికిందిరా రామం! అయితే నీ వైఫ్‌కి సిస్టర్ వుండే దన్నమాట."

"అవున్రా! అదో గాధ, పోనిద్దూ ఇప్పు డెందుకా విషయం"

"ఆ గాదేదో మాకు వినిపించరా! వినాలనుంది"

"భోజనాలైన తర్వాత చెప్పుకుందాం లేరా"

"మేము భోజనం ఏర్పాట్లమీద రాలేదే!"

"ఒరేయ్, మా యింటికొచ్చి భోజనం చెయ్యకుండా వెళ్దామనుకుంటున్నావా? అదేం కుదరదు, ముందు స్నానానికి లే"

"రామం! నువ్వేమీ అనుకోకుండా వుంటే నాలుగు కేరేజీలు హోటల్ నుండి తెప్పిస్తాను. వంటకి కూడా వగైరాలు బజారునుండి తేవాలేమో కదా?"

"ఒరేయ్, శేఖర్! మళ్ళీ ఈసారి ఆమాటంటే నే నొప్పుకునేది లేదు తెలుసా? ఇంట్లో ఆడవాళ్ళుండగా హోటల్ మెతుకులేం కర్మరా! నేను మంచి డిన్నర్ చేయలేననా నీ భయం?"

"చాచా, అదేం మాటరా! మా వదినగార్కి ఇబ్బం దౌతుందని అలా గన్నాను."

"మా మరదలు కూడా వుందిగా మీ వదినకి సహాయంగా భయం లేదులే"

వారిద్దరూ పిచ్చాపాటి మాట్లాడుకుంటూ ఒక గంట కాలం గడిపేశారు. కాంత వంట లయ్యాయని చెప్పగానే యిద్దరూ స్నానాలు చేసి భోజనానికి కూర్చున్నారు. ముచ్చట లాడుకుంటూ బాల్యమిత్రు లిద్దరూ భోజనం కానిచ్చారు. తాంబూలాలు నములుతూ తీరిగ్గా కూర్చున్నారు.

"రామం, భోజనా లయాయిగా! ఇప్పుడు చెప్పరా నీ హిస్టరీ. నువ్వీ స్థితికి ఎలా దిగజారేవు? మనం విడిపోయిన దగ్గర్నుంచీ ఏమి జరిగిందీ సవిస్తారంగా చెప్పరా!"

"పోనీరా శేఖర్! అదో విచారగాధ. అదంతా చెప్పి నిన్ను బాధ పెట్టదల్చలేదు."

Estd : 1952 Tele : "JAMAKKALAM". Phone No. 65




SIVAKUMAR INDUSTRIALS

*Manufacturers of :*

**ART SILK CARPETS & BEDSHEETS**

**P. B. No. 38. BHAVANI (Via) ERODE (S. I.)**

Our Factory Potential with Highest Productivity Facilitate Prompt Supply Balanced Prices & With Desired Designs.

Encourage Cottage Industries Extending Kind Patronage.

Visalandhra is the Ever - Growing Market of our Production.

WANTED AGENTS ALL OVER INDIA
( Hall Carpets A Speciality )

"అదిగో మళ్ళీ మొదలెట్టావూ నీ ఫిలాసఫీ. కష్టంలోనే వుందిరా సుఖం. కష్టాలు మానవులకి కాకపోతే మానులకొస్తాయా? అదీగాక తన బాధలు మరొకరికి చెప్పుకుంటే మనసుకి కొంచం శాంతి కల్గుతుంది. నేను పరాయివాణ్ని కానుగా! నాతో చెప్పడానికేరా! సస్పెన్సులో పెట్టక తొందరగా చెప్పరా బాబూ!"

"ఐతే వినరా! నేను కాలేజీలో చదువుకుంటూండగా నాన్నగారు పోయారు. అందువల్ల బి. ఎ. తో చదువుకు స్వస్తి చెప్పేసాను. మేరేజ్ చేసుకుని కొన్నాళ్ళు భూములు చూసుకుంటూ యింటివద్దే కాలం గడిపేశాను. తర్వాత రైల్వేలో వుద్యోగానికి సెలక్టయాను. నేను రైల్వేలో వుద్యోగం చేస్తూండగా మా అమ్మకూడా పోయింది. ఉద్యోగమంటే విసుగుపుట్టి మా నాన్న మిగిల్చిపోయిన కాస్త భూమినీ అమ్మి వైజాగ్‌లో బట్టల వ్యాపారం మొదలెట్టాను. క్రమేపీ వ్యాపారం వృద్ధిలోకి రాసాగింది. మన మిత్రుడు సూరిగాడు చెప్పినంత పేరు కాకపోయినా కొద్దిగా పేరు ప్రతిష్టలు సంపాదించాను. అవకాశమైనంతవరకు బీదలకు ప్రేమ సమాజానికి, యితర అనాధాశ్రమాలకు తగిన సహాయం చేస్తూండేవాడిని. నా మనస్సు నానాటికి ప్రజాసేవవైపు మళ్ళింది. పాపుకికూడా వెళ్లడం మానేసి హరిజన, ప్రేమ సమాజాలకు యితర ప్రజాహిత కార్యాలలో పాల్గొంటూండేవాణ్ని. మిత్రులు కొందరు వ్యాపారం పెద్దది చెయ్యమని సలహా యిచ్చారు. అందువల్ల పదివేల రూపాయలిచ్చి నా బావమరది మూర్తిని మద్రాసు పంపేను. నా మరదలు సుశీలకూడా మద్రాసు చూస్తానని పట్టు పట్టడంతో దాన్నికూడా మద్రాసు పంపవలసి వచ్చింది. అప్పటికి మా సుశీల వయస్సు పద్నాలుగు సంవత్సరాలు. అమ్మా నాన్నా పోవడం వల్ల వారిద్దరూ కూడా శాంతతోబాటు ఇక్కడే వుండేవారు. మూర్తిని, సుసీలని జనతాకి దిగబెట్టి నేనింటికి వచ్చేశాను.

ఆ మర్నాడు రేడియోలో-నిన్నరాత్రి బయలుదేరిన మద్రాసు మెయిలు గోదావరి వంతెనమీద ప్రయాణం చేస్తూండగా పట్టాలు తప్పి నదిలో పడిపోయిందనీ, చాలమంది చనిపోయారని విన్నాను. మనవాళ్ళు జనతాలో వెళ్లేరు కదా! మరేం భయం లేదనుకున్నాను.

మూడోనాడు న్యూస్ పేపర్లో కొన్ని ఫోటోలు వేసి అవ్యక్తులతాలూకు బంధువు లెవరో తెలియలేదనీ, ఎవరయినా వున్నట్లయిన గోదావరి స్టేషన్ మాష్టార్ని కలుసుకోవాల్సిందని ప్రకటించారు.

ఆ ఫోటోలలో నా బావమరది మూర్తిఫోటో చూడగానే నిర్ఘాంతపోయాను. గుండె ఆగినంత పనయింది. తల తిరగడం ప్రారంభించింది. ఇది కలా నిజమా అనిపించింది. మీ వదిన సంగతి వేరే చెప్పనక్కరలేదు. ఉన్న ఒక్క తమ్ముడూ, చెల్లెలు పోయారని కంటికీ మింటికీ ఏడుస్తూ కూర్చుంది. దానికి ధైర్యం చెప్పి గుండె దిటవు చేసుకుని గోదావరి స్టేషనుకి బయలుదేరి స్టేషన్ మాష్టార్ని కలుసుకున్నాను: ఆయన మూర్తితాలూకు ఒక డైరీని మాత్రం నా కప్పగించారు. "ఆయన వెంట పద్నాలుగు సంవత్సరాలుగల ఒక అమ్మాయి, పదివేల రూపాయలతో క్యాష్ బేగు వుండవలసిందే? ఆ అమ్మాయి ఎక్కడుంది?" అని ఆతృతగా అడిగాను. "ఏమో! ఆ అమ్మాయితోబాటు ఆ బేగ్‌కూడా ప్రవాహంలో కొట్టుకుపోయిందేమో?" అన్నారు స్టేషన్ మాష్టారు. చేసేది లేక విషాదాంత వదనంతో యింటికి తిరిగివచ్చాను.

జనతాలో బయలుదేరిన వాళ్ళు మెయిలు ప్రమాదంలో ఎలా చిక్కుకున్నారో నా కర్థం కాలేదు. తర్వాత మూర్తి డైరీ చదువుతూంటే-'సుసీల పట్టుదలవల్ల తాము సామర్లకోటలో దిగి వాళ్ళ పెదనాన్నగారింటికి వెళ్లామనీ, వెంటనే మెయిల్‌ని కేచ్ చేసామని' రాసి వుంది. చాలాకాలం వరకూ మేమా దెబ్బ నుండి కోలుకోలేక పోయాము. తర్వాత నా క్రెడిట్ వున్న బేంకుదివాలా తీసింది. పెట్టుబడికి డబ్బు లేక పోవడం వల్ల క్రమంగా వ్యాపారం దెబ్బ తింది. తమ్ముడు, చెల్లాయి పోయారనే విచారంతో శాంత మంచం పట్టింది. దాన్ని మళ్ళా మన స్థితికి తీసుకు రావడానికి అప్పు చెయ్యవలసి వచ్చింది. ఆ అప్పుల గురించి నాస్వంత యిల్లు అమ్మవలసి వచ్చింది. ఇప్పుడే ఈయిల్లు మా మామయ్య చనిపోతూ నాపేర వ్రాసింది. ప్రస్తుతం ట్యూషన్సు చెప్పుకుంటూ కాలం వెళ్ళబుచ్చుతున్నాను. ఇదిరా బాబూ! నా హిస్టరీ." ఒక దీర్ఘ నిట్టూర్పు వదిలాడు రామం.

"అబ్బా! అయితే నీ వెనకే యింత గాధ జరిగిందన్నమాట. ఎంత ఉచ్ఛస్థితిలో వుండవలసిన వాడివి యింత

హీనస్థితికి దిగజారిపోయావురా! విధి వైపరీత్యాన్ని తలచుకొంటూంటే ఆశ్చర్యమేస్తుంది.''

''రోజులు ఎప్పుడూ ఒక్కలాగుండవు కదరా! అందుకే 'కలిమిలేములు కావడి కుండలు' అన్నారు పెద్దలు. జీవితంలో కష్టమూ, సుఖమూ అనుభవించవలసి వస్తుంది. అన్నిటికీ తట్టుకోవాలి.''

''ఇంత గుండె ధైర్యం కలవాడివి కాబట్టే కాలాన్ని నెట్టుకొస్తున్నావు. మరొకరైతే ఈ పరిస్థితులకు జడిసి ఏ ఆత్మ హత్యకి పూనుకొనేవారో.''

''ఆత్మ స్థయిర్యాన్ని కోల్పోయి పరిస్థితులకు లొంగి ఆత్మహత్యకు పూనుకున్నవాడు మానవుడే కాదురా! కష్టమైనా సుఖమైనా సంతోషంతో ఎదుర్కొన్నవాడే మానవుడి ఘనత.''

''అందరూ నీలాగే వుండరు కదట్రా! అందులోనే నువ్వు వేదాంతివి. నేను నీతో వాదించలేను. రామం! అయితే, మీ మరదలు గురించి ఏ సంగతి తెలియలేదన్నమాట''

''లేదురా! ఒకవేళ బ్రతికుంటే ఎవరైనా అప్పగిస్తారని పేపర్లో ఫోటో వేయించాను. గోదావరి చుట్టుపట్ల వెతికించాను. కాని ఫలితం కనుపించలేదు. చనిపోయిందనే నిర్ధారణ చేసుకున్నాం. ఒకవేళ బ్రతికుంటే సులభంగా గుర్తుపట్టవచ్చు. ఎలాగంటే చిన్నప్పుడు ఒకనాడు వాళ్ళ అమ్మగారు అన్నం వండుకుంటూంటే సినిమాకి డబ్బు లివ్వమని అల్లరిపెట్టిందట. తర్వాత యిస్తాన్లే అని నచ్చ చెప్పారట వాళ్ళమ్మగారు. కాని సుసీల వినక మొరాయించడంతో కోపంతో బయటకు పొమ్మని రెక్క పట్టుకు తోసేసారుట వాళ్ళమ్మ. ప్రమాదవశాత్తు పొంగుతున్న పొయ్యిమీద పడి కుడి కాలి పిక్క కాలిపోయిందిట. క్రమంగా పుండుమానినా మచ్చ అలాగే వుండి పోయింది. ఈ సంగతంతా తర్వాత శాంత చెప్పింది నాకు. అదే మా సుశీలను తెలుసుకోడానికి గుర్తు''

ఇలాగా వారిద్దరూ వారి వారి కుటుంబ విషయాలు, చిన్ననాటి కబుర్లు చెప్పుకుంటున్నారు.

DEPENDABLE PLACE
For DELIGHTFUL
DRESS GOODS

BENARES,
BANGALORE, SAREES
BENGAL, etc.
SILK of EVERY STYLE, HANDLOOM COTTON SAREES, DHOTIES and other Clothing Materials.

ALL OF THE HIGHEST QUALITY

**S. R. B. Kuppuswamy Iyer & Son,**
(Formerly :—S. R. BALUSWAMY IYER & SONS)

**230, East Marret Street, Madurai** Phone : 2036
**117, Nyneappa Naick Street, P. T. Madras** Phone : 32206

రామం, శేఖర్‌ల భోజనాలవగానే శాంత శశిని స్నానం చెయ్యమని నీళ్ళిచ్చింది. శశి తన చీర మార్చుకుంటూండగా ఆవిడ కుడికాలి పిక్కమీదున్న మచ్చను చూసిన శాంత "సుశీ!" అంటూ కేకేసి క్రింద పడి పోయింది. శశి నిర్ఘాంతపోయి నిలుచుంది.

శాంత కేక విన్న రామం శేఖర్‌లు గబగబా వంటింట్లోకి వచ్చి కింద పడి వున్న శాంతను మంచం మీద పడుకోబెట్టి ముఖం మీద నీళ్ళు జల్లేరు. కొంతసేపటికి శాంతకు తెలివి వచ్చింది. అసలు సంగతేమిటని రామం శేఖర్‌లు అడగ్గా జరిగిన సంగతంతా వివరించింది శాంత. అక్కను గుర్తుపట్టిన శశి "అక్కా!" అంటే, చెల్లిని గుర్తుపట్టిన శాంత "చెల్లీ!" అంటూ ఒకర్నొకరు కౌగిలించుకున్నారు. వారి ఆనందానికి అంతులేదు. రామం, శేఖర్‌ల ముఖాలు సంతోషంతో విప్పారినై.

"ఏమిటే సుశీ! యిన్నాళ్ళు ఎక్కడున్నావు? ఎలా పెరిగావు? మా మరిదికీ నీకూ పెళ్ళెలా జరిగిందీ వివరంగా చెప్పవే" అంది ఉక్కిరి బిక్కిరౌతూ శాంత.

"మిమ్మల్నింత క్షోభపెట్టిన నన్ను ముందు క్షమించు అక్కా!"

"పోవే, పిచ్చిపిల్లా! యింకా క్షమించాలంటావు. మళ్ళీ నువ్వీ జన్మలో కనుపిస్తావనుకోలేదు. భగవంతుడు మనల్ని కలిపాడు. అదే పదివేలు. ఆఁ! ఇప్పుడు చెప్పవే అసలు సంగతి."

"నువ్వు నిజంగా దేవత అక్కా!" అంటూ తన సంగతి చెప్పడం ప్రారంభించింది. "నేను ఆ నాటి మెయిలు ప్రమాదంలో ఒక పెట్టె సందున స్పృహ తప్పి పడి వుండగా రైల్వేవాళ్ళు నన్ను తీసి హాస్పిటల్లో అడ్మిట్ చేసారు. నాకు స్పృహ వచ్చిన తర్వాత "ఎవరి తాలూకా? ఏ ఊరు?" అని అడిగారు. అన్నయ్య మరణానికి, బావ డబ్బు పోడానికి నేనే కారణభూతురాల్నని వాపోయాను. ఇన్ని అనర్థాలకు మూలమైన నా ముఖం మీకు చూపెట్టడం యిష్టం లేక పోయింది. వచ్చినా మీరు నన్ను వుండనివ్వరేమో నన్న భయంతో నాకెవరూ లేరని చెప్పేశాను. హాస్పిటల్


ప్రింటింగ్ మెషిన్లు

PNF



11" × 17" ప్రత్యేక సైజు

మరియు

ఫుల్ స్కేప్, క్రౌన్ ఫోలియో

కటింగ్ మెషిన్ 18" మరియు 26"

మా ఇతర తయారింపులు :-

* టెక్స్టైల్స్ మిషినరి పార్ట్స్, కాఫి గ్రైండర్స్ & రోస్టర్స్.

* వి. రోప్ పుల్లీలు, పుష్ టర్నింగ్ లేత్ లు

FOR FURTHER DETAILS

**PIONEER FOUNDRY**

167. PATEL ROAD [Phone No. 6103] COIMBATORE-9

With the best compliments of:—

# CHARI & RAM

**Suppliers of Ravi Vat Dyes and other Dyes.**

( Post Box No. 38. )

East Gate. MADURAI. (S. India)

Branch : 293, THAMBUCHETTY STREET, MADRAS-1.

*STOCKISTS ALL OVER INDIA.*

నుండి డిశ్చార్జి అవగానే నన్నొక మహానుభావుడు మద్రాసులోని ఒక సేవాసదనంలో చేర్చారు. అక్కడ చదువుతూ స్కాలర్ షిప్ సంపాదించి బి. ఏ. పాసయ్యాను. శేఖర్, నేను బి. ఏలో క్లాస్ మేట్సుమయ్యాము. తర్వాత ఆయన సహాయం వల్ల వారి ఆఫీసులో చేరాను. పరస్పరం ప్రేమించుకుని రిజిష్టర్ మేరేజ్ చేసుకున్నాము. ఇదక్కా నా సంగతి అంటూ ముగించింది శశి.

"ఓహో, ఈరోజు ఏం శుభదినంరా రామం! చిన్ననాడు విడిపోయిన మన బాల్య స్నేహితులం, ఎడబాటయిన అక్కచెల్లెళ్లు ఈనాడు కలుసుకోగలిగాం. ఓహో విధి విలాసమంటే యిదే కాబోలు' అంటూ అయితే ఈ రోజునుంచి శశి 'శుశి' అయిందన్నమాట" అని శశి వైపు ఒక చిరునవ్వు విసిరాడు శేఖర్.

"ఫోండీ!" అంటూ తన ముఖపద్మాన్ని కెంపు రంగుగా మర్చింది శశివురఫ్ సుశి.

"ఏమోయ్, మరిదీ! మా కూనని మరీ చులకనచేసి పారేస్తున్నావ్" అంటూ చెల్లెలి తరఫున వకాల్తాపుచ్చుకుంది కాంత.

"అయితే, సుశీ! మరి మీ అక్కని మొదటే పోల్చేవు కాదేం?" తన అనుమానాన్ని వెలిబుచ్చాడు శేఖర్.

"అప్పటి మా అక్కా బావలకి, యిప్పటి మా అక్కా బావలకీ చాలా తేడా వచ్చేసిందండీ! బాగా మారిపోయారు. మా అక్క నన్ను గుర్తించే వరకూ నేను మా అక్కను గుర్తించలేకపోయాను" అంది శశి. సారీ! శుశి.

"అయితే మీ అక్కనేగాని నన్ను మాత్రం గుర్తించలేదన్నమాట" అని చమత్కరించాడు రామం.-

"ఆగండి! మీలో మీరు మాట్లాడుకోవటమే గాని నాకు చాన్సు యివ్వరన్నమాట" అంటూ బుంగమూతి పోజు పెట్టాడు శేఖర్.

"మాట్లాడవోయ్ మరిదీ! నిన్ను కాదన్నవారెవరు?" అంటూ శేఖర్ని ప్రోత్సహించింది కాంత.

"ఐతే వినండి. ఈ శుభసమయంలో మరొక శుభవార్త. ఏమిటంటే-మా ఆఫీసులో మేనేజర్ పోస్టు ఒకటి కాళీగా వుంది. రామం ఎలాగూ బి. ఏ. పాసయ్యాడు. కాబట్టి వాడిని మా ఆఫీసు మేనేజరుగా నియమిస్తున్నాను. అదీగాక మాకు క్వార్టర్సుగా పెద్ద బంగళా యిచ్చారు. కనక మనమందరం ఆ బంగాళాలో నే కలిసి వుందాం" అంటూ ముగించాడు.

"ఒరేయ్, శేఖర్! నీ మేలు ఎన్ని జన్మలెత్తినా తీర్చుకోలేనురా! నీలాంటి మిత్రుడు దొరకడం నిజంగా నా అదృష్టమేరా!" అంటూ రామం శేఖర్ని కౌగిలించుకున్నాడు.

"ఇంకా మిత్రులమో అంటావేమిరా! మన మిప్పుడు మిత్రులంటే కాదు స్వంత అన్నదమ్ములం! తెల్సిందా?" అంటూ శేఖర్ రామాన్ని ఆలింగనం చేసుకున్నాడు.

'అన్నదమ్ముల'వంటి ఆ 'ఆప్తమిత్రుల' గాఢాలింగనాన్ని చూసి కాంతా, సుశీలలు ముసి ముసి నవ్వులు నవ్వుకున్నారు.

(సమాప్తం.)